సాక్షి రంగారెడ్డి

సోమవారం । 2 । జనవరి । 2023



నేడు ఖగోళ తరగతులు

ఒకప్పుడు ఖగోళ పరిశోధనలకు నిలయంగా ఉన్న నక్షత్రశాల నేడు ఖగోళశాస్త్రంపై అవగాహన పెంచుకునేందుకు వేదికగా మారింది. 8లో▸

నేడు పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల ప్రాథమిక కీ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో గత నెల జరిగిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల జవాబు పత్రాల ప్రాథమిక కీని సోమవారం విడుదల చేయనున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. కీలోని ప్రశ్నలు, జవాబుల్లో తప్పులు, ఒప్పులు ఇతర సందేహాలుంటే నాలుగు రోజుల్లో మెయిల్ ద్వారా పంపించాలన్నారు. వారం రోజుల్లో ఫలితాలు విడుదల చేయనున్నట్లు చెప్పారు.

నిమ్స్‌లో సీనియర్ రెసిడెంట్ వైద్యుల భర్తీకి నోటిఫికేషన్

లక్డీకాపూల్: నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో సీనియర్ రెసిడెంట్ వైద్యుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 7వ తేదీలోపు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అనస్థీషియా, జనరల్ మెడిసిన్, ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఎం.డి చేసిన అభ్యర్థులు సీనియర్ పోస్టుకు అర్హులవుతారని ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

కొత్త లక్ష్యాలతో ముందుకు సాగాలి



ఇబ్రహీంపట్నం రూరల్: నూతన సంవత్సరంలో కొత్త లక్ష్యాలతో ముందుకు వెళ్తే అనుకున్నవన్నీ సాధించవచ్చని జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి హరికృష్ణ భూపతి అన్నారు. రంగారెడ్డి కోర్టులో ఆదివారం జ్యుడిషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి తిరుపతితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయం కోసం వచ్చే వారికి తప్పకుండా సహాయం అందుతుందన్నారు. అనవసరమైన గొడవలు పడి కోర్టుల చుట్టూ తిరగొద్దని సూచించారు. న్యాయ వ్యవస్థ అందరికీ సమానమేనన్నారు. చట్టాలపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో జ్యుడిషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నక్క లక్ష్మణ్‌గౌడ్, ఇన్‌చార్జి ప్రెసిడెంట్ సాంబశివరావు, దారా రాములు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

దూరవిద్య పూర్వ విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని ప్రొఫెసర్.జి రామిరెడ్డి దూరవిద్య కేంద్రంలో డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, ఇతర కోర్సులు పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో జరిగే ఓయూ గ్లోబల్ అలుమ్ని మీట్-2023కు హాజరుకావచ్చని వెల్లడించారు.

స్పాట్ రిజిస్ట్రేషన్

గ్లోబల్ అలుమ్ని మీట్-2023కు హాజరు కావాలనుకునే పూర్వవిద్యార్థులు ఇంత వరకు రిజిస్ట్రేషన్ చేసుకోకుంటే స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే గ్లోబల్ అలుమ్ని మీట్ వద్ద పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించారు.


రేపు వీసీ రీసెర్చ్ అవార్డుల ప్రదానం

ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఈ నెల 3న వైస్ చాన్స్‌లర్ రీసెర్చ్ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. ఓయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ కాలేజీల పర్మినెంట్, కాంట్రాక్టు అధ్యాపకులు రేపు ఉదయం 10.30 గంటలకు ఠాగూర్ ఆడిటోరియంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

భాగ్యలక్ష్మి అమ్మవారి సేవలో గవర్నర్

చార్మినార్: రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ దంపతులు ఆదివారం చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ శశికళ వారికి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. దక్షిణ మండలం పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆమె మొదటి పూజను చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి చేసినట్లు తెలిపారు.

ఫుల్ కిక్కు



న్యూ ఇయర్ జోష్‌లో తెగతాగేసిన మద్యం ప్రియులు

- ఎక్సైజ్‌శాఖకు చివరి రెండు రోజుల్లో డబుల్ ఇన్‌కం
- 1,04,185 లిక్కర్.. 35,651 బీరు కాటన్ల విక్రయాలు
- డిసెంబర్‌లో రికార్డుస్థాయిలో రూ.847.29 కోట్ల ఆదాయం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 2022 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ.. 2023లో అడుగుపెడుతున్నామనే ఆనందంతో జిల్లావాసులు ఫుల్లుగా మద్యం తాగేశారు. ఎక్సైజ్‌శాఖకు భారీ ఆదాయాన్ని సమకూర్చిపెట్టారు. డిసెంబర్ 31 నేపథ్యంలో ప్రభుత్వం మందుబాబుల కోసం మద్యం దుకాణాలను అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచిన విషయం తెలిసిందే. చాలా మంది ముందు రోజు నుంచే మద్యం కొనుగోలు చేశారు. చివరి రెండు రోజుల్లో జిల్లాలో 1,04,185 లిక్కర్..35,651 బీరు కేసుల అమ్ముడుపోయాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.106 కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. ఆల్కహాల్ ఆరోగ్యానికి హానికరమని వైద్య నిపుణులు సూచిస్తున్నా అవేవీ పట్టించుకోకుండా తెగ తాగేశారు.

రికార్డు స్థాయిలో ఆదాయం

జిల్లాలో 234 మద్యం దుకాణాలు ఉండగా, వీటిలో శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటిండెంట్ కార్యాలయం పరిధిలో వంద, సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటిండెంట్ కార్యాలయం పరిధిలో 134 వరకు ఉన్నాయి. గత ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు నెలకు సగటున రూ.650 కోట్ల నుంచి రూ.700 కోట్ల వరకు ఆదాయం సమకూరేది. గత 11 నెలలతో పోలిస్తే డిసెంబర్‌లో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. లిక్కర్ అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి రూ.847.29 కోట్ల ఆదాయం సమకూరింది. తెలంగాణ వ్యాప్తంగా గత నెలలో ప్రభుత్వానికి రూ.3,373.08 కోట్ల ఆదాయం సమకూరగా, మెజార్టీ ఇన్‌కం జిల్లా నుంచే రావడం విశేషం.

చివరి ఆరు రోజుల్లో మద్యం అమ్మకాలు

తేదీ	లిక్కర్‌కాటన్లు	బీర్‌కాటన్లు	ఆదాయం (రూ.కోట్లలో)
26	37,156	62,272	42.83
27	33,395	60,799	41.06
28	38,287	33,392	43.05
29	41,552	24,707	45.45
30	63,530	14,529	63.33
31	40,655	21,122	43.21

ఆరు నెలల్లో మద్యం విక్రయాలు, ప్రభుత్వానికి సమకూరిన ఆదాయం

మద్యం అమ్మకాలు	జూలై	ఆగస్టు	సెప్టెంబర్	అక్టోబర్	నవంబర్	డిసెంబర్
లిక్కర్ కాటన్లు	7,08,703	6,73,891	6,22,388	6,85,050	5,48,357	7,74,451
బీర్ కాటన్లు	7,39,591	8,43,703	7,76,540	8,510,82	7,06,772	9,54,377
ఆదాయం (రూ.కోట్లలో)	716.18	699.06	647.09	705.93	558.75	847.29



చేతులెత్తి గోవింద నామస్మరణ చేస్తున్న భక్తులు

చిలుకూరు.. భక్తజన హోరు

- నూతన సంవత్సరవేళ తరలివచ్చిన భక్తులు
- గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయ పరిసరాలు
- భక్తిపారవశ్యంలో ముంచెత్తిన అన్నమయ్య కీర్తనలు

మొయినాబాద్: కొత్త సంవత్సర వేళ భక్తజనం చిలుకూరు వైపు అడుగులు వేశారు. మొదటి రోజే స్వామివారిని దర్శించుకోవాలన్న తపనతో ఆదివారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గోవింద నామస్మరణ, రవిరాజ బృందం అన్నమయ్య కీర్తాలాపనతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తులు క్యూ కట్టారు. ఆలయం ముందు, వెనుక ద్వారాల నుంచి లోపలికి పంపించి క్యూలైన్లు కట్టించారు. నాలుగు వరుసల్లో మహాద్వార దర్శనానికి అవకాశం కల్పించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, అర్చకుడు రంగరాజన్ తదితరులు పర్యవేక్షించారు. సాయంత్రం 5 గంటల వరకు సుమారు 75 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని రంగరాజన్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని హోటళ్లు, షాపులన్నీ కిటకిటలాడాయి.

గతంలో కంటే తగ్గిన రాక

ప్రతి సంవత్సరంలాగే ఈసారి కూడా లక్ష మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని ఆలయ అర్చకులు, పోలీసులు అంచనా వేశారు. కానీ ఈసారి గతంలో కంటే తగ్గింది. సోమవారమే వైంకుఠ ఏకాదశి ఉండటంతో ఆ ప్రభావం ఉండొచ్చని భావిస్తున్నారు.

పటిష్ట ఏర్పాట్లు

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ, సైబరాబాద్ పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఆలయంలోకి ప్రవేశించే చోట మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు. 100 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించినట్లు ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి తెలిపారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించిన, బందోబస్తు ఏర్పాట్లు చేసిన పంచాయతీ పాలకవర్గానికి, సైబరాబాద్ పోలీసులకు ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ సౌందరరాజన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



క్యూలైన్‌లో ఆలయంలోకి వెళ్తున్న భక్తులు



ప్రయాణికులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు

ప్రయాణికుల సంక్షేమానికి పెద్దపీట

సాక్షి, సిటీబ్యూరో/అఫ్జల్‌గంజ్: మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి టీఎస్ ఆర్టీసీ ఎండీ, వీసీ సజ్జనార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రయాణికులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. ప్రయాణికులతో ముచ్చటించి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీలో పని చేస్తున్నందుకు చాలా గర్వంగా ఉందని, గత సంవత్సరం ప్రయాణికులు బాగా ఆదరించారని చెప్పారు. ఒక్క రాఖీ పౌర్ణమి నాడే దాదాపు 40 లక్షల మంది ప్రయాణించారని, ఆ ఒక్క రోజే రికార్డు స్థాయిలో రూ. 20 కోట్ల రాబడి వచ్చిందని గుర్తు చేశారు. గత ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ప్రయాణికుల ఆదరాభిమానాలు ఉంటాయని ఆశా భావం వ్యక్తం చేశారు. ప్రయాణికులు, సిబ్బంది ఆర్టీసీకి రెండు కళ్లలాంటివారన్నారు. ప్రయాణికుల సంక్షేమానికి ఈ ఏడాది పెద్ద పీట వేస్తామని తెలిపారు. అందుకు ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. లేఖలు, ట్విట్టర్ ద్వారా తమ విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన ప్రజారథాన్ని సజ్జనార్ ప్రారంభించారు.

ప్రయాణికులకు సన్మానం

ఎన్నో ఏళ్లుగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులను ఎండీ సజ్జనార్ సన్మానించారు. సంగీత, కిష్టయ్య, బి.జయలక్ష్మి, జయ ప్రకాష్, సుధారాణి, స్వప్న, లక్ష్మణ్, అశోక్, నర్సింహులు, నరసింహా రెడ్డి, సుధాకర్, సిద్ధా రెడ్డి, ప్రమీల, జి.రమాదేవి, సుధామని, కంభం రాములు, జె. శ్రీనివాస్, సుహాసిని, ఉమాపతి, సునీత, సీహెచ్ విజయ్, ఎస్.ఎం.హుస్సేన్, ఎండీ జియాస్, ధనలక్ష్మి, సరిత, సంగీతను శాలువాలతో సత్కరించారు. 8 స్మార్ట్ ఫోన్లను రికవరీ చేసిన హెడ్ కానిస్టేబుల్ బాబురావును సన్మానించారు. కార్యక్రమంలో సీవోవో డా.రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం, హైదరాబాద్, రంగారెడ్డి ఆర్ఎంలు రాజేంద్రప్రసాద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

మహంకాళి అమ్మవారికి మంత్రి తలసాని పూజలు

రాంగోపాల్‌పేట్: సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ ఏడాది కూడా మరింత అభివృద్ధి సాధించాలని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. నూతన సంత్సరం పురస్కరించుకుని ఆయన ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు పాడిపంటలు, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈఓ గుత్తా మనోహర్ రెడ్డి, చైర్మన్ సురిటి కామేష్, బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ఈవో అన్నపూర్ణ, మాజీ కార్పొరేటర్లు అరుణ గౌడ్, కిరణ్మయి, శేషకుమారి నాయకులు తలసాని సాయి కిరణ్‌యాదవ్, పవన్‌కుమార్‌గౌడ్, మహేశ్ యాదవ్, ఆనంద్ పాటిల్, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్, చందు తదితరులు పాల్గొన్నారు.



మైసమ్మ ఆలయం కిటకిట

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండిలో కొలువైన మైసమ్మ దేవతను ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ప్రత్యేకించి నూతన సంవత్సరం కావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఈ ఏడాది పాడి పంటలు, విద్య, వ్యాపార వాణిజ్య, అన్ని రంగాల్లో వృద్ధిలోకి వచ్చేలా చూడాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సమీపంలోని శివ రామాలయాలను పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు చేశారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు.



వాహనాలతో నిండిపోయిన ఆలయ పరిసరాలు

తేల్చేదెప్పుడో.. వేసేదెప్పుడో!

- ఫార్మాసిటీ రోడ్డు నిర్మాణానికి వీడని గ్రహణం
- సర్వే చేసి చేతులు దులుపుకొన్న రెవెన్యూ శాఖ
- రైతులకు నష్ట పరిహారంపై స్పష్టత కరువు
- నిధులున్నా ముందుకు సాగని యాచారం- నస్దిక్‌సింగారం రోడ్డు పనులు

యాచారం: ఫార్మాసిటీ రోడ్డు నిర్మాణానికి గ్రహణం వీడడం లేదు. భూమి కోల్పోయే రైతులకు చెల్లించే పరిహారం విషయంలో అధికారుల నుంచి స్పష్టమైన హామీ లేకుండా పోయింది. యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని పలు గ్రామాల్లోని 19,333 ఎకరాల అసైన్డ్, పట్టా భూమిలో ఫార్మాసిటీని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. నాగార్జునసాగర్-శ్రీశైలం రహదారి మధ్యలో ఏర్పాటు చేస్తున్న ఈ ఫార్మాసిటీకి రెండు రహదారుల నుంచి వంద అడుగుల రోడ్డు వెడల్పు చేయడానికి అనుమతిచ్చింది. శ్రీశైలం రహదారిపై కందుకూరు నుంచి వంద అడుగుల రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నాగార్జునసాగర్ నుంచి మీరాఖాన్‌పేట వరకు వంద అడుగుల రోడ్డు నిర్మాణ పనులు మాత్రం నిలిచిపోయాయి. ఐదేళ్ల క్రితమే ప్రభుత్వం రోడ్డు నిర్మాణం కోసం రూ.72 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించే విషయంలో మాత్రం నిర్లక్ష్యం కనిపిస్తోంది.



నస్దిక్‌సింగారం- మీరాఖాన్‌పేట రోడ్డు

సర్వేకే పరిమితం

యాచారం నుంచి నందివనపర్తి వరకు, నందివనపర్తి నుంచి నక్కర్తమేడిపల్లి, నందివనపర్తి నుంచి నస్దిక్ సింగారం వరకు రోడ్డు వెడల్పునకు టీఎస్ఐఐసీ ప్రతిపాదనలు రూపొందించింది. దాదాపు 15 కిలో మీటర్ల దూరం, 70 ఎకరాల భూమి, 60 మంది రైతులకు చెందిన వ్యవసాయ భూమి పోతుందని అధికారులు సర్వే ద్వారా లెక్కగట్టారు. నందివనపర్తి నుంచి నక్కర్తమేడిపల్లి వెళ్లే దారిలో పెద్ద సర్కిల్ నిర్మాణం అవుతుందని అధికారులు అంటున్నారు. సర్కిల్‌కు సంబంధించి భూ సర్వే కూడా పూర్తయింది. నందివనపర్తి నుంచి యాచారంలోని సాగర్‌రోడ్డుకు కలిపే లింకుపై స్పష్టత లేదు. సాగర్‌రోడ్డుపై పెద్ద ఫార్మా సర్కిల్ నిర్మించాలని యోచిస్తున్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఫార్మా సర్కిల్ ఏర్పాటు చేస్తే పలు దుకాణాలు కూల్చక తప్పదు. వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. నందివనపర్తి నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు కాకుండా నందివనపర్తి దాటిన తర్వాత బండరాళ్ల నుంచి నేరుగా సాగర్‌రోడ్డు సాయిశరణం ఫంక్షన్ హాల్ ఎదురుగా రోడ్డు నిర్మించాలని అధికారులు సర్వే పూర్తి చేశారు. కానీ ఎంత మంది రైతులు, ఎన్ని ఎకరాల భూమి పోతుందనే వివరాలు తేల్చలేదు. నందివనపర్తి నుంచి సాయి శరణం ఫంక్షన్ హాల్ ఎదురుగా రోడ్డు నిర్మాణం చేపడితే హెచ్ఎండీఏ వెంచర్‌లోంచే రోడ్డు వేయాల్సి ఉంటుంది. ఆ వెంచర్‌లో ఇప్పటికే పలువురు ప్లాట్లు కొనుగోలు చేశారు.

త్వరలో ప్రజాప్రతినిధులు, అధికారుల వద్దకు..

ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వెంకటాచారి వారం క్రితం యాచారం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఫార్మాసిటీ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు రూ.24 లక్షల పరిహారం ఇచ్చే అవకాశం ఉందని ప్రకటించారు. అధికారికంగా మాత్రం స్పష్టత లేదు. ప్రస్తుతం యాచారం- కందుకూరు రోడ్డు పక్కన ఇరువైపులా ఎకరా రూ.2 కోట్ల వరకు పలుకుతోంది. ఎకరాకు రూ.50 లక్షలు, మీరాఖాన్‌పేట హెచ్ఎండీఏ వెంచర్‌లో 121 గజం ప్లాటు ఇచ్చేలా చూడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలో పరిహారంపై స్పష్టత, హెచ్ఎండీఏ వెంచర్‌లో ప్లాటు ఇచ్చే విషయంలో రెండు, మూడు రోజుల్లో నందివనపర్తి, నక్కర్తమేడిపల్లి, నస్దిక్‌సింగారం పరిధిలో రోడ్డు నిర్మాణానికి భూములు కోల్పోయే రైతులు మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కలెక్టర్‌ను సైతం కలవాలని నిర్ణయించుకున్నారు.

న్యాయమైన పరిహారం ఇవ్వాలి



నందివనపర్తి- యాచారం వరకు నిర్మాణం చేపట్టే రోడ్డుకు అర ఎకరా పోతోంది. రోడ్డు నిర్మాణం సంతోషమే కానీ న్యాయమైన పరిహారం ఇస్తే బాగుంటుంది.

– కొంగళ్ల జోగిరెడ్డి, రైతు, నందివనపర్తి

వైకుంఠ ఏకాదశికి ముస్తాబు



విద్యుత్ కాంతుల్లో చేవెళ్ల వేంకటేశ్వరస్వామి ఆలయం

వైకుంఠ ఏకాదశికి ఆలయాలు ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చర్యలు చేపట్టారు.

రిజిస్టర్‌లో సంతకాల మాయ!


మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- విధులకు రాకున్నా మరుసటి రోజు వచ్చి సంతకాలు
- కేశంపేట ఎంపీహెచ్‌ఈఓ నిర్వాకం

కేశంపేట: విధులకు హాజరవ్వనని ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడు.. ఆసుపత్రికి రాలేనని హాజరు పట్టికలో సీఎల్ పెడతాడు.. ఆసుపత్రికి వచ్చిన రోజు సీఎల్ ఉన్న చోట సంతకం చేసి మాయ చేస్తాడు... ఇది కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇటీవల బదిలీ పై వచ్చిన ఓ అధికారి నిర్వాకం. గతేడాది నవంబర్ 14న సిద్దిపేట జిల్లా నుంచి ఉపేందర్‌రెడ్డి కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎంపీహెచ్‌ఈఓగా బదిలీపై వచ్చాడు. ఆరోగ్య కేంద్రంలో అధికారులు విధులకు హాజరైతే విధిగా రిజిస్టర్‌లో సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఉపేందర్‌రెడ్డి మాత్రం తనకు తాను వెసులుబాటు కల్పించుకున్నాడు. విధులకు హాజరుకాకుండా ఉంటే ముందు రోజు సీఎల్ అని రాస్తున్నాడు. సీఎల్ రాసే చోట తన సంతకంతో మ్యాచ్ అయ్యేలా ముందే జాగ్రత్త పడతాడు. మరుసటి రోజు ఆస్పత్రికి వచ్చాక సంతకం చేస్తున్నాడు. ఈ విషయమై యూడీసీ నూరుల్లా హసన్‌ను సంప్రదించగా ఉపేందర్‌రెడ్డి హాజరు మారుస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని, మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇన్‌చార్జి యూడీసీగా విధులు నిర్వహిస్తున్నందున పూర్తిస్థాయిలో దృష్టి సారించడం లేదన్నారు. ఇదే విషయమై ఉపేందర్‌రెడ్డిని వివరణ కోరగా నేను డిప్యూటేషన్ కోసం ప్రయత్నాలు చేస్తున్నానని, అందుకే విధులకు సరిగా హాజరు కావడం లేదని, సెలవులో ఉన్నానని పొంతనలేని సమాధానం చెబుతున్నాడు.. మండలంలోని ఓ శాఖకు చెందిన అధికారి తనకు బంధువని చెబుతుండడం గమనార్హం.

'భగీరథ' వాటర్ ట్యాంకులో పడి..

పంచాయతీ కార్మికుడి మృతి


రాంజీ మృతదేహం

కొత్తూరు: ఓవర్ హెడ్ ట్యాంకు మరమ్మతుల కోసం పైకి ఎక్కిన పంచాయతీ కార్మికుడు ట్యాంకులోనే పడి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని కొడిచర్లతండా పంచాయతీ ఖాజీగూడతండాలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఖాజీగూడతండాకు చెందిన రాంజీ(38) పంచాయతీలో ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఉదయం ట్యాంకు నుంచి నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో తండా సమీపంలోని మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకు పైకి ఎక్కి పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. కిందనున్న మిగిలిన సిబ్బంది గుర్తించి స్థానికులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకునే లోపే నీటిలోపడి ఊపిరాడక చనిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ట్యాంకులోని నీటిని తొలగించి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించా రు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు సంతానం. కేసు దర్యాప్తులో ఉందని ఎస్‌ఐ సయీద్ తెలిపారు.

గేదెలు కడుగుతుండగా వ్యక్తి

మొయినాబాద్: గేదెలు కడుగుతూ ప్రమాదవశాత్తు కుంటలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దమంగళారం గ్రామానికి చెందిన వడ్డె మల్లేష్(40) వ్యవసాయంతోపాటు పశుపోషణ చేస్తున్నాడు. శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని కుంటలో గేదెలు కడుగుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. ఎంతకీ తేలకపోవడంతో స్థానికులు అతని కోసం గాలించారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం రాత్రి అతని శవాన్ని వెలికి తీశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వేర్వేరు చోట్ల కారు, బైక్ ఢీ..

ఆరుగురికి గాయాలు

కొందుర్గు: ఎదురెదురుగా వస్తున్న కారు, మోటర్ సైకిల్ ఢీ కొనడంతో ఐదుగురు గాయపడ్డారు. ఈ సంఘటన కొందుర్గు మండలం చెక్కలోనిగూడ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం తంగెళ్లపల్లి వైపు నుంచి కొందుర్గు వైపు వస్తున్న కారు, కొందుర్గు వైపు నుంచి తంగెళ్లపల్లి వైపు వెళుతున్న మోటరు సైకిల్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు పల్టీ కొట్టింది. కారు నడుపుతున్న వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడగా, మోటర్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తుల్లో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ఒకరి కాలు విరిగింది. వీరిని స్థానికులు చికిత్స కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కొందుర్గు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో..

ఇబ్రహీంపట్నం: కారు, బైక్‌ను ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. మంచాల మండల కేంద్రానికి చెందిన గణేశ్(35) బైక్‌పై వెళ్తుండగా ఓ కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో గణేశ్‌కు కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫిట్‌నెస్ కాపాడుకోవాలి.. క్రైం రేటు తగ్గించాలి

బంజారాహిల్స్: నూతన సంవత్సరంలో పోలీసు అధికారులు తమ ఫిట్‌నెస్ దృష్టి పెట్టడంతో పాటు క్రైం రేటు తగ్గించేందుకు కృషి చేయాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. శనివారం రాత్రి బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. 'ఫిట్‌కాప్' యాప్‌ను హోంగార్డు ఆఫీసర్ నుంచి ఉన్నత స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసుకోవాలని అందులో ఆరోగ్య వివరాలు పొందుపర్చాలని ఎప్పటికప్పుడు ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ ఉత్సాహంగా పని చేయాలని సూచించారు. నగర ట్రాఫిక్‌లో ఎన్నో మార్పులు తీసుకురాబోతున్నామని డ్రోన్ కెమెరాల వ్యవస్థను ఇందుకు వినియోగించనున్నట్లు తెలిపారు. లా అండ్ ఆర్డర్‌లో బందో బస్తులు, శాంతి భద్రతల సమస్యలు తలెత్తినప్పుడు డ్రోన్‌ల సహాయంతో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్, ఏసీపీలు సుదర్శన్, పీవీ గణేష్, ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు పాల్గొన్నారు.

నాడు పరిశోధనలు.. నేడు ఖగోళ తరగతులు

ఒక్కప్పుడు ఖగోళ పరిశోధనలకు నిలయంగా ఉన్న నక్షత్రశాల.. నేడు విద్యార్థులు ఖగోళశాస్త్రంపై అవగాహన పెంచుకునేందుకు వేదికగా మారింది. ప్రతీ శనివారం జాపాల్-రంగాపూర్ నక్షత్రశాలలో విద్యార్థులకు ఖగోళంపై ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు.

నగరం నుంచి తరలిన నక్షత్రశాల

- 220 ఎకరాల విస్తీర్ణంలో జాపాల్-రంగాపూర్ మధ్య ఏర్పాటు
- విద్యార్థులకు శాస్త్ర విజ్ఞానం పెంపునకు దోహదం


జాపాల్-రంగాపూర్ నక్షత్రశాల

మంచాల: హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో మండల పరిధిలోని జాపాల్-రంగాపూర్ గ్రామాల మధ్య ఎత్తైన గుట్టలపై 220 ఎకరాల విస్తీర్ణంలో దట్టమైన అడవిలో నక్షత్రశాల ఏర్పాటు చేశారు. ఖగోళశాస్త్రంపై అవగాహన పెంచుకునేందుకు వివిధ పాఠశాలల విద్యార్థులు సెలవు రోజుల్లో తరగతులకు హాజరవుతుంటారు. మరి కొందరు కుటుంబ సమేతంగా విచ్చేసి నక్షత్రశాల గురించి తెలుసుకుని అనంతరం అటవీ అందాలతో సేద తీరుతుంటారు.

నగరం నుంచి కాలుష్యానికి దూరంగా..

ఈ నక్షత్రశాలను ఆరో నిజాం మీర్ మహబూబ్‌అలీఖాన్ కాలంలో ఏర్పాటు చేశారు. ఇది తొలినాళ్లలో హైదరాబాద్‌లో ఉండేది. మహబూబ్‌అలీఖాన్ ఆస్థానంలో ఖుర్షీద్‌జాబహదూర్ రక్షణ మంత్రిగా చేసేవాడు. ఖుర్షీద్ చిన్నకుమారుడు నవాబ్‌జాఫర్‌జంగ్ బహదూర్ ఈ నక్షత్రశాల ఏర్పాటుకు కారకుడు. ఆయన ఇంగ్లాండ్‌లో ఆస్ట్రానమీ చదివి 1908లో ఇండియాకు వచ్చాడు. ఈ క్రమంలో ఎనిమిది అంగుళాల 'కూకీ ఆస్ట్రోగాఫ్', 15 అంగుళాల 'గ్రబ్ రిఫ్లక్టర్ టెలిస్కోప్' హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. వాటితో నగరంలోని ఫిసల్‌బండలో (నక్షత్రశాల)అబ్జర్వేటరీని ఏర్పాటు చేశారు. అయితే దాన్ని 1918లో ఉస్మానియా వర్సిటీకి అప్పగించారు. తర్వాత నగరంలోనే బేగంపేట్‌కు తరలించి నిజామియా అబ్జర్వేటరీ అని పేరు పెట్టారు. ఇంగ్లాండ్ కు చెందిన ఖగోళ శాస్త్ర పరిశోధకుడు 'ఛాట్‌ఉడ్' తొలి డైరెక్టర్. ఆయనకు నెలకు అప్పట్లో 1500 ఉస్మానియా సిక్కాలను వేతనంగా ఇచ్చారు. బేగంపేట్, అమీర్ పేట్ ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెంది కాలుష్యం విపరీతంగా పెరిగింది. దీంతో 1950లో కాలుష్యానికి దూరంగా మార్చాలని అప్పటి డైరెక్టర్ కరంధీకర్ యూనివర్సిటీకి ప్రతిపాదనలు పంపాడు. 1963లో డైరెక్టర్ డాక్టర్ కె.డి.అభయాంకర్ నగరానికి 51కిలో మీటర్ల దూరంలో ఎత్తైన గుట్టల ప్రాంతం. కాలుష్యానికి దూరంగా ఉన్న జాపాల్-రంగాపూర్ గ్రామాల మధ్య నిర్మాణం చేపట్టారు. 1968లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఇది ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ విభాగం ఆధీనంలో ఉంది.

వినోదంతో పాటు విజ్ఞానం

ఇక్కడకి వచ్చే వారికి వినోదంతో పాటు విజ్ఞానం లభిస్తోంది. దేశంలోనే పెద్ద నక్షత్రశాల. ఇక్కడ 1963లో 1.2మీటర్లు(48అంగుళాలు) ఉండే ఒక టెలిస్కోప్‌ను ఏర్పాటు చేశారు. బైనరీ, విచిత్ర, ప్రకాశించే నక్షత్రాలు, నక్షత్రాల సమూహాలపై పరిశోధనలు చేయడానికి ఉపయోగపడుతుంది. గ్రహ వాతావరణాలు, గ్రహశకలాల గురించి ఈ కేంద్రంలో పలు అధ్యయనాలు జరిగాయి. ఇప్పటి వరకు ఇక్కడ 2లక్షల నక్షత్రాలపై పరిశోధనలు చేశారు.

- 1980ఫిబ్రవరి16న స్కైలాబ్ పడింది. లోకమంతా మునిగి పోతుందని, అందరూ చనిపోతారనే వదంతులు వ్యాపించాయి.
- ఇక్కడ పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు అది సంపూర్ణ సూర్యగ్రహణమని తేల్చారు. అందుకు సంబంధించిన ఛాయా చిత్రాలను ఇక్కడ నుంచే తీశారు.
- ప్రతీ 75 ఏళ్లకు ఒకసారి తోకచుక్క 'హేలీ' కనిపిస్తుంది. 1986 ఫిబ్రవరి 9న కనిపించింది. దీనిపై జాపాల్-రంగాపూర్ నక్షత్రశాలలో అధ్యయనం చేశారు.
- 1994 జూలై 16 నుంచి 21 వరకు వేర్వేరు తోకచుక్కల శకలాలు బృహస్పతి గ్రహాన్ని ఢీకొట్టాయి. దీంతో బృహస్పతి పై మచ్చలు ఏర్పడాయి. అందుకు సంబంధించిన ఛాయా చిత్రాలు ఈ నక్షత్రశాల నుంచే తీశారు. ఇక్కడ తీసిన చిత్రాల ఆధారంగానే 'కామెట్ షూమేకర్ లేవి' అనే శాస్త్రవేత్త దాని ప్రభావం తెలుసుకోగలిగాడు. ప్రస్తుతం ఇక్కడ పరిశోధనలు నిలిపివేశారు. విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన 18రకాల పరికరాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు శాస్త్ర విజ్ఞానాన్ని అందిస్తున్నారు. విద్యార్థులకు ఖగోళశాస్త్రం పై ప్రత్యేకంగా డిజిటల్ టీవీ ద్వారా ఫ్యాకల్టీల సహకారంతో తరగతులు నిర్వహిస్తున్నారు.

ప్రయాణ మార్గం

నగరం నుండి నక్షత్రశాలకు చేరుకోవడానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. నగరంలో ఎంజీబీఎస్ బస్టాండ్ నుంచి 277 నెంబర్, సికింద్రాబాద్ నుంచి 279 బస్సు ఎక్కితే ఇబ్రహీంపట్నం చేరుకుంటాం. అక్కడి నుంచి ప్రతీ గంటకు జాపాల్-రంగాపూర్ వెళ్లేందుకుగా వీలుగా ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాలు అందుబాటులో ఉన్నాయి.

ప్రత్యేక తరగతులు



జాపాల్-రంగాపూర్ నక్షత్రశాలలో ప్రత్యేకంగా విద్యార్థులకు ఖగోళ శాస్త్రంపై ప్రత్యేక తరగతులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాల స్థాయి నుంచి ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నాం.

– శంకర్, ఇన్‌చార్జి, నక్షత్రశాల

అట్టడుగు వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం


కాంగ్రెస్ పార్టీ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రేవంత్‌రెడ్డి, నాయకులు

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

షాబాద్: అట్టడుగు వర్గాల సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీ 2023 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింపుల సత్యనారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, వసంతం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సింహులు, జంగయ్య, గౌరీశ్వర్, చంద్రారెడ్డి, శ్రీరాములు,కు మార్, శ్రీకాంత్, కొండల్‌యాదవ్, రా జుగౌడ్, ఆంజ నేయులు,సత్యం,శ్రీనివాస్‌రెడ్డి,మహేశ్ పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి


బాలికలతో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ముషీరాబాద్: రాష్ట్రంలో తల్లిదండ్రులు లేని అనాథ పిల్లల సంక్షేమంపై ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. పిల్లల చదువుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ నేటికి కార్యరూపం దాల్చలేదన్నారు. ఆదివారం ఆయన రెయిన్‌బో అనాథశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ... అనాథ పిల్లల సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 2015 జూన్ 23న అనాథ పిల్లల చదువుకోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్గ ఉప సంఘంతో జరిగిన సమావేశంలో పేర్కొన్నారన్నారు. అనాథ పిల్లలు కుల ధృవీకరణ పత్రం విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రెవెన్యూ అధికారులు కుల ధృవీకరణ పత్రం ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని ఆరోపించారు. అనాథ పిల్లలకు స్మార్ట్‌కార్డులు ఇస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. ఈ సందర్భంగా అనాథ పిల్లలతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గజ్జెల రాజశేఖర్, గంగి కృష్ణ నాయకులు, శామ్యూల్, పెంటయ్య, ఎల్లయ్య, సదా లక్ష్మి పాల్గొన్నారు.

నెత్తురోడిన రహదారులు

- ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధ దంపతుల దుర్మరణం
- మల్లాపూర్‌లో కారు ఢీకొని మరో వ్యక్తి మృతి


ఘటనాస్థలంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

కంటోన్మెంట్: నగరంలో ఉంటున్న కుమారుడిని చూసేందుకు నిర్మల్ నుంచి వచ్చిన వృద్ధ దంపతులు ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందిన సంఘటన బోయిన్‌పల్లి చౌరాస్తాలో ఆదివారం చోటు చేసుకుంది.. నిర్మల్ నగరానికి చెందిన తులసీదాస్ (65), రాజమణి (62) దంపతులు నగరంలోని గచ్చిబౌలిలో ఉంటున్న తమ కుమారుడు రామరాజు ఇంటికి వెళ్లేందుకు ఆదివారం నగరానికి వచ్చారు. మధ్యాహ్నం బోయిన్‌పల్లిలో బస్సు దిగి రోడ్డు దాటుతుండగా బాలానగర్ నుంచి సికింద్రాబాద్ వైపునకు వెళ్తున్న జీడిమెట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వీరిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వీరిని స్థానికులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా అప్పటికే ఇద్దరూ మృతి చెందారు. పోలీసులు బస్సు డ్రైవర్ మార్గం నరహరి అదుపులోకి తీసుకున్నారు. మృతుల కుమారుడు రామరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు

బోయిన్‌పల్లి చౌరస్తాలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఆగ్రహించిన స్థానికులు పోలీసులు, అధికారులకు కనువిప్పు కలగాలంటూ ఓ పక్క అంబులెన్స్‌లో మృతదేహాలు, ఆర్టీసీ బస్సును చూపిస్తూ ఓ వీడియో రూపొందించి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. పాదచారులు రోడ్డు దాటేందుకు తగిన ఏర్పాట్లు లేకపోవడం కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

అనుమతి లేకుండా వేడుకలు

కేసు నమోదు చేసిన పోలీసులు

పహాడీషరీఫ్: అనుమతులు లేకుండా ఓ ఫాంహౌస్‌లో మద్యం పార్టీ చేసుకున్న ఇద్దరిపై పహాడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కె.కిరణ్ కుమార్ తెలిపిన ప్రకారం.. జల్‌పల్లిలోని లలిత్ ఫాం హౌజ్‌లో నితిన్, సిద్దార్థ్ అనే యువకులు అనుమతులు లేకుండా డిసెంబర్ 31న మద్యం తాగుతూ.. హుక్కాను పీల్చుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం రాత్రి 11.30గంటలకు దాడి చేసి మద్యం, హుక్కా ఫ్లేవర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


అనిల్(ఫైల్)

తలకొండపల్లి: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గట్టుఇప్పలపల్లికి చెందిన వెంకటమ్మ, జంగయ్య దంపతుల కుమారుడు ఎంగి అనిల్(23) ప్రైవేట్ ఉద్యోగి. ఆదివారం రాత్రి తన ఇంట్లో ఫ్యాన్ ప్లగ్ పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. మెరుగైన చికిత్స నిమిత్తం అనిల్‌ను కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

చెరువులో పడి యువకుడి మృతి

నిజాంపేట్: నూతన సంవత్సర వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది..చెరువు గట్టుపై కూర్చున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తులో చెరు వు పడి మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజాంపేట్ రాజీవ్ గృహకల్పకు చెందిన డేవిడ్(25) శనివారం రాత్రి స్నేహితులతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నాడు. అనంతరం అతను సమీపంలోని తురక చెరువు గట్టుపై స్నేహితులతో కలిసి కూర్చున్నాడు. నిద్రమత్తులో ప్రమాదవశాత్తు డేవిడ్ చెరువులో పడ్డాడు. దీనిని గుర్తించిన అతని స్నేహితులు చెరువులో అతడి కోసం గాలించారు. అయితే డేవిడ్‌కు ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా కృష్ణగిరి జాతర

బొంరాస్‌పేట: మండల కేంద్రమైన దుద్యాల శివారులో వెలసిన కృష్ణగిరి ఆలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. మూడు రోజులుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు. వేడుకల చివరి రోజు ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు లంకాదహనం, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కొత్త సంవత్సరం కావడంతో భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు భారీగా తరలివచ్చారు.